# లోలకం

శ్రీహరిమూర్తికి నిద్ర మెలకువ వచ్చింది. టీ, పాయ్ మీది గడియారంలో రెండు ముళ్ళూ కౌగలించుకొని పన్నెండు గంటలమీద ఆగినయ్:

బాగా ఆకలిగా వుందనిపించింది. ఎంత ప్రయత్నించినా నిద్ర వచ్చే సూచనలేం కనుపించలేదు.

సాయంత్రం టిఫిన్ తిన్నాడు స్నేహితుల బలవంతం మీద. భోజనాల వేళకు ఆకలి వెయ్యలా. హోటలుదాకా వెళ్ళి తినాలనిపించక వచ్చేశాడు. వచ్చి మంచినీళ్ళు త్రాగి నిద్రవచ్చేదాకా సిగరెట్లు త్రాగుతూ "లొలిటా"ని చదివాడు.

ఫలితం, అర్ధరాత్రి మెలకువ రావటం కడుపులో క్షుద్బాధ.

ఏమన్నా కడుపులో పడితేగాని నిద్రరాదు అని తీర్మానించుకున్నాడు శ్రీహరి. కప్పుకున్న శాలువా విసిరేసి! వెళ్ళి లైటు వేశాడు.

టప్పున వెలిగి ఆరిపోయింది, శాశ్వతంగా.

అగ్గిపెట్టె వెతకటంలో మంచంకోడు తగిలింది కాలికి. ఆకలి, కాలికి దెబ్బ! చిర్రెత్తుకొచ్చింది. కళ్ళంబడి నీళ్ళు తిరిగాయి కూడా. అయినా సహించాడు.

అగ్గిపెట్టె వెతికే ప్రయత్నం మాని, చొక్కా వేసుకుని, తలుపు గడియ వేసి మేడమెట్లు దిగాడు.

ప్రక్కగదిలో 'బి. యస్సీ' చదివే కుర్రాడు లైటు దేదీప్యమానంగా వెలుగుతుండగా, పండువెన్నెట్లో పడుకుని ప్రియురాలిని కౌగిలించుకుని నిద్రపోతున్నట్లు, జువాలజీ పుస్తకాన్ని గుండెలమీద భద్రంగా వుంచుకున్నాడు.

లైటుకిచ్చే అద్దె రెండు రూపాయలు, తెల్లార్లూ లైటు ఇష్టం వచ్చినట్లు వాడటం. చూస్తే శ్రీహరిమూర్తికేదో మతక సామెత గుర్తుకొచ్చింది.

వెళ్ళి లైటు ఆర్పేద్దా మనుకున్నాడు. కాని సంశయించాడు.

తీరా లైటు తీసెయ్యటంతో కుర్రాడికి మెళకువ వచ్చి చూస్తే ఏమను కుంటాడు?

ఇంటి యజమాని, వట్టి జడ్డి వెధవ డబ్బు కాపీనం జాస్తి అనుకోగలడు. మరీ మాట్లాడితే "మీరా మేష్టారూ! దొంగేమోననుకున్నాను. 'అని వొళ్ళు విరుచుకుని "ఇప్పుడే అలా కళ్ళు మూసుకున్నాను మేష్టారూ!' అని సమర్ధించు కోగలడు.

అయినా ఆ కుర్రాడు, యింకా ఓ నెలలో పరీక్షలయ్యాక ఎలాగూ వెడ తాడు. ఇన్నాళ్ళూ అయ్యాక, ఇప్పుడు తొందరపడి అతగాడి దృష్టిలో తేలిక కావడం దేనికి?

శ్రీహరిమూర్తి వీధిలో పడ్డాడు.

మైరోడ్డుదాకా, వీధంతా నిర్మానుష్యంగా వుంది. వీధి దీపాలు ఓడి పోయిన అభ్యర్ధి ముఖంలా, ఎర్రగా వెలాతెలా పోతున్నాయి తమ ముఖార విందాన్ని చూసుకు సిగ్గుపడుతూ.

ఓ యింట్లో పసిపిల్ల లేచి ఏడుస్తున్నది ఆకలై. తల్లి అలసిపోయిందేమో లేచినట్లు లేదు. క్షణం ఆ యింటి ముందు ఆగాడు శ్రీహరిమూర్తి. పోనీ వెళ్ళి ఇంటి యిల్లాలిని లేపితేనో? అని కూడా అనుకున్నాడు. రెండడుగులు కూడ వేశాడు.

గేటుమీద "కుక్కలున్నాయి" అని వుంది. వెంటనే జాగ్రత్తపడి వెనక్కొచ్చేశాడు.

నైజాం హోటలు దగ్గర బాగాసందడిగావుంది. పరీక్షలకెళ్ళే కుర్రాళ్ళు, వాడిన ముఖాలతో వుత్సాహంగా తమ తమ ప్రయత్నాలు రాబోయ్యే ప్రశ్నల గురించి, జమిలిగా, విడివిడిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. హోటలు ప్రక్కనున్న సినిమాహాల్లోంచి వుండీ వుండీ మాటలు, సంగీతం వినబడుతున్నాయి.

హోటలు ముందుగా ఆరుబయట వేసిన కుర్చీలేవీ ఖాళీగా లేనందున, శ్రీహరిమూర్తి లోపలకెళ్ళి ఓ మూలగా వాష్‌బేసిన్ కివతలగా కూర్చున్నాడు.

ప్రొప్రయిటరు వెనకాలగావున్న వెంకటేశ్వరస్వామి పటానికి అగరొత్తుల పొగపట్టి మసకేసివుంది. ప్రమిదలోని వత్తి నూనె అయిపోవటంవల్ల కొడిగట్టివుంది. అరిగిపోయిన గ్రామఫోను రికార్డు భాషా సమస్య జోలికి పోకుండా పాట వినిపించసాగింది. శ్రీహరిమూర్తికి ఎదురుగా కూర్చున్న రైతులు కాళ్ళు ఎత్తి పెట్టుకుని, తాపీగా లంకాకు చుట్టలు కాలుస్తున్నారు గత వర్తమానాలు మరచి.

"ఓ ప్లేటు వేడి పూరీ" ఆర్డరిచ్చి కూర్చున్నాడు శ్రీహరిమూర్తి.

హోటలులోని ట్యూబులైట్ల చుట్టూ పురుగులు, సాముహిక నృత్యం చేస్తూంటే ఓ బల్లి వింతగా చూడసాగింది.

సాయంత్రం కొద్దిగానైనా ఎంగిలిపడితే బాగుండేది. అనుకున్నాడు శ్రీహరిమూర్తి.

రాను రాను, తను బేఫర్‌లాగా తయారవుతున్నాడు. వేళకు తిండిలేదు నిద్ర లేదు. తన ఆలనా పాలనా అడిగే వాళ్ళెవరూ లేరు. మూణ్ణెల్లకోసారి వచ్చే మలేరియా నిర్మూలన అధికారి, చేబదులుకొచ్చే మిత్రులూ తప్ప!

ఇదంతా స్వయంకృతాపరాధమే?.... ....అవును! అంతే!

తండ్రి చిన్నప్పుడే కాలం చెయ్యడంతో అమ్మకు తననెలా పెంచాలో తెలియక, వెర్రి అభిమానంతో తన మాట వేదవాక్కులా చేసింది. ఫలితం ఎన్ని సంబంధాలు వచ్చినా, తను అవుననలేదు.

కన్న తల్లి చెప్పినా తనను ఒప్పించలేకపోయింది. బ్రతికినంత కాలమూ!

శ్రీహరిమూర్తి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ, సర్వారావు పూరీ ప్లేటు టక్కున టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

అర్డరిచ్చిన వేడి పూరీలు రబ్బరులా వున్నాయి. శ్రమ తప్ప నమలడం మ్రింగడం, శ్రీహరిమూర్తికి అలవికాలేదు. తెచ్చినవి వృధా చెయ్యడానికి మనస్కరించక కడుపులో ఆకలి యెక్కువవడం వల్ల ఓ పూరీని సాధ్యమైనంత వరకూ నమిలి, శివుడు కాలకూట విషాన్ని మ్రింగినట్లు మ్రింగేశాడు. జిడ్డు జిడ్డుగా వున్న ఇత్తడి గ్లాసులో నీళ్ళన్నీ త్రాగినా, తిన్న పూరీ గొంతు జారిందిగాని కడుపులోకి నీళ్ళే వెళ్ళాయి.

శ్రీహరిమూర్తికి కళ్ళ వెంబడి నీళ్ళొచ్చాయి. క్షణం కళ్ళు మూసుకుని తల పట్టుకు కూర్చున్నాడు: క్షుద్బాధ కన్నా ప్రస్తుత స్థితి మరీ బాధాకరంగా తయారైంది.

ఐనా శ్రీహరిమూర్తి ధైర్యం వీడలేదు. ప్రక్క టేబిల్ మీద మంచినీళ్ళ గ్లాసు తీసుకుని. మరో గ్లాసుడు నీళ్ళు త్రాగాడు. అలవాటు లేనివాడు కాపు సారాయి పుచ్చుకొన్నట్లనిపించింది.

సర్వారావుకు టీ పురమాయించి గోడకు జారిగిలబడి కూర్చున్నాడు.

రెండో ఆట సినిమా వదిలారు. జిడ్డోడుతున్న మొహాలు, రేగిన జుత్తు. ముక్కుపుటాలు భరించలేనంత చమట వాసనతో జనం వచ్చి హోటలులోకి వరదనీళ్ళలా ప్రవేశించారు.

దాంతో మరికొంత ఆలస్యమై టీ తెచ్చేవేళకు శ్రీహరిమూర్తికి విసుగొచ్చి లేచి, వెళ్ళేందు కుద్యుక్తుడయ్యాడు.

సర్వారావు. అడుగు ముందుకు వేయకుండా అడ్డుపడి మరుగుతున్న టీ ఇచ్చి వెళ్ళాడు. "అలా ఆర్డరిచ్చి వెళితే యెలాగండీ. యిప్పుడే సినిమా వదలడంతో రద్దీగా వుంది" అని కూడా అన్నాడు, తనదేమీ తప్పులేదని హెచ్చరిస్తూ.

టీలో చక్కెర చాలక చేదుగా వుంది. అయినా త్రాగేశాడు తన మొర వినే నాధుడు ఎవరూ లేరని తెలిసి.

ఆ హోటలు వాతావరణంలోంచి రోడ్డు మీద కొచ్చేక కుడితిలోపడ్డ ఎలుక ఒడ్డున పడ్డట్లనిపించింది. చల్లగాలికి హాయిగా వుంది ప్రాణం.

తనంతవరకూ ఏకాకి. కావాలనే అలా వుండిపోయాడు. అదే సుఖమనిపించింది అప్పటికి. కాలేజీకి వెళ్ళటం, ఇంటికొచ్చి వోపికుంటే చదవడం, అలా నల్లేరు మీద బండిలాగ గడిచింది జీవితం. తను ఏ లక్ష్యం వేపు ప్రయాణం చేస్తున్నదీ తనకే తెలియదు. తన జీవితానికి చుక్కాని పట్టేవాళ్ళెవరూ లేరు-అవసరమనిపించలా.

ఐతే యూనివర్సిటీలో చదివేప్పుడు కొన్ని క్రొత్త భావాలు కలిగాయి. అది యూనివర్సిటీ విద్యా ప్రభావం మాత్రం కాదు పూర్తిగా. అందుకు మేరీ యిగ్నేషియస్ ప్రభావం చాలావరకుంది.

ఆ అమ్మాయి కేరళ సుందరి. అందరితో చనువుగా వుండేది. శ్రీహరిమూర్తి ఆ అమ్మాయి అంటే అభిమానించేవాడు. నల్లగావున్నా రోజూ రకాల రకాల దుస్తులు దరించడమేగాక, వివిధరకాలుగా హెయిర్ డ్రస్సు చేసుకునేది.

మేరీ రెండుసార్లు శ్రీహరిమూర్తి గదికి వచ్చింది. చాలాసార్లు వంటరిగా శ్రీహరిమూర్తితో కాఫీ త్రాగింది.

స్థాణువుగా వున్న శ్రీహరిమూర్తి, కొద్దిగా చలించాడు. బద్దకంతోవున్న కనురెప్పలెత్తి ప్రపంచాన్ని పరిశీలించాడు మొదటిసారిగా. తనింకా పూర్తిగా వెలుగును చూడలేదు. చుట్టూవున్న జనం వెలుగు కోసం విజ్ఞానం కోసం పరుగు తీస్తున్నారు. అందులో మేరీకూడా వుంది.

తనూ ఆ పరుగుపందెంలో పాల్గొనాలి నిర్ణయించుకోలేకపోయాడు

మేరీ కావాలి, అంటే తప్పదు తనూ పరుగు తీయాలి, తనూ కనీసం ఐ.ఎ.ఎస్. అన్నా కావాలి అప్పటకి మేరీ అందదు. ఆమె భర్తతో విదేశాలు వెళ్ళాలని, విజ్ఞానం, నాగరికత, వెల్లువలా పొంగి పొరలుతున్న దేశాల్లో ఆ జనం మధ్య ఆ సమూహంలో కలిసిపోయి గతాన్ని మర్చిపోయి కాలంతో కొట్టుకుపోవాలని ఆలోచన.

తనకు తిండికి లోటులేదు. ఆస్తితో పాటు, పరువు ప్రతిష్ట తన తండ్రి ఆర్జించి అప్పజెప్పిపోయాడు తనకు.

కానీ, యివన్నీ మేరీని యివ్వలేవు.

శ్రీహరిమూర్తి డ్రస్ మార్చాడు. గదిలోని షెల్ఫులో పుస్తకాలు మార్చాడు, జుత్తు మార్చుకున్నాడు. పరిసరాలు, మిత్రులు మార్చుకున్నాడు-యివన్నీ మేరీకి ఇష్టమని.

నానా యాతనలు పడి ఐ.ఎ.ఎస్. పరీక్షకు వెళ్ళాడు.

ఫలితం-మేరీ తన పేరుకు అలెగ్జాండరును తగిలించుకుని వెళ్లిపోయింది.

శ్రీహరిమూర్తి మనస్ఫూర్తిగా అలెగ్జాండరును అభినందించాడు. వానలో వెళ్ళి నవదంపతులు బెంగుళూరు వెళ్లుతూవుంటే వీడ్కోలిచ్చాడు. తనఓటమిని అంగీకరించాడు సిగ్గులేకుండా.

కాని ఈ నాటికి శ్రీహరిమూర్తికి బాధలేదు. ఈర్ష్యలేదు. మేరీ తనకు అందలేదని తను పుట్టి పెరిగిన వాతావరణం. తనను మేరీని పెళ్ళి చేసికో

నివ్వావు.

ఐ. ఏ. ఎస్. పరీక్ష తన్నేసింది. ఆనర్స్ పరీక్షలో ద్వితీయ శ్రేణి మాత్రమే వచ్చింది.

చదువుమీద ఆసక్తి నశించింది. ఇంటికి వచ్చేశాడు తల్లి పెళ్ళి చేసుకో మంటే మాట్లాడలేదు....

అద్దెకున్న బి. యస్సీ. కుర్రాడు నిద్రపోతూనే వున్నాడు. లైటు దేదీప్యమానంగా వెలుగుతూనే వుంది.

ఈ సారి ధైర్యం వచ్చింది. వెళ్ళి లైటు ఆర్పేసి మేడమీద కెళ్ళాడు శ్రీహరిమూర్తి.

మేడమీద ప్రక్కవాటాలో వున్న మెడికల్ ఏజంటు తెల్లవారుఝాము బండికి ప్రయాణసన్నద్ధుడవుతున్నాడు.

శ్రీహరిమూర్తిని చూసి పలకరించాడు. "సినిమానుంచా?" అని.

"కాదు."

"కర్నూలు వెడుతున్నా! మరోవారం రోజులు దాకా రాను!" అన్నాడు మెడికల్ ఏజంటు సుందరం.

ఆయన్ను చూస్తే శ్రీహరిమూర్తికి ఈర్ష్య, నీటుగా ముస్తాబై, హాయిగా వూళ్ళు తిరుగుతుంటాడు. చేతినిండా డబ్బు. ప్రతి వూళ్ళో కూడా పరిచయాలు. ఆ మాటే అన్నాడు.

సుందరం ఫెళ్ళున నవ్వి. "మూర్తిగారు. ఓ మాట చెప్పనా?" అన్నాడు.

"చెప్పండి!"

"అలా కూర్చోండి!"

కూర్చున్నాడు. సుందరమూ కూర్చున్నాడు.

"మిమ్మల్ని చూసి నేను చాలా అసూయ చెందుతున్నా సుమా!"

"నన్ను చూశా!"

"ఆహా! మీకేం చెప్పండి! చీకూ చింతా లేదు. ఈ వూళ్ళో యిళ్లు లక్షలు చేస్తుంది. నెల తిరక్కుండా ఐదు వందలు అద్దె వస్తుంది. పైగా పొలమూ వుంది. మీరొక్కరూ మీకేం చెప్పండి. యింత వరకూ పెళ్ళాం లేదు! కనుక రాజులా సుఖంగా వున్నారు. అవునా!"

"చెప్పండి"

"నా సంగతి వూళ్ళో వుంటే బిజినెస్ జరగటంలేదే అని బాధ. క్యాంపు కెళితే పిల్లలెలా వున్నారో అన్న దిగులు. నెలకు రెండొందలు మా తమ్ముడికి పంపాలి. మా చెల్లిలి పెండ్లి చేయాలి. సంబంధాలు చూడమని మా నాన్న వారానికో ఉత్తరం వ్రాస్తాడు. తెల్లారి లేచింది మొదలు ఈ లెదర్ బ్యాగ్ పుచ్చుకుని డాక్టర్ల చుట్టూ తిరగడం....ఇప్పుడు చెప్పండి. నన్ను చూస్తే నిజంగా మీకు అసూయగా వుంటే మీరు ఈ సంచీ పుచ్చుకు కర్నూలు వెళ్ళండి."

శ్రీహరిమూర్తికి ఏమి తోచలేదు సిగరెట్ ముట్టించుకుని. చిన్నగా నవ్వాడు

"అంతే గురువుగారు తను తప్ప ప్రతి తలమాసిన వెధవ సుఖపడిపో తున్నాడే అని యావ. మానవ సహజం!"

శ్రీహరిమూర్తి వచ్చేశాడు! వెతుక్కుంటూ వెళ్ళి శేషతల్పంమీద శయనించాడు.

లుంగ లుంగలుగా పొగ శూన్యంలోకి బద్ధకంగా పయినిస్తుంటే....అని పించింది! తనకేం తక్కువ?

తను తన యింట్లో అద్దెకుండే వాళ్ళకంటే మెరుగే, అన్నిటా! ఐతేనేం తను బ్రహ్మచారి! చెరువులోపడ్డ దుంగలా, నదిలోని చెట్టులా వుండిపోయాడు

క్రింద గ్యారేజీలో ఓ యల్. డి. సి. సుబ్బారావు, నలుగురు పిల్లలతో విడిదిచేశాడు. ఎండిన మునక్కాడలావుంటాడు శ్రీహరిమూర్తి వళ్ళకతడు.

నలుగురు పిల్లల్లో ఒకడు మూగవాడు, ఒకడికి లివర్, పెళ్ళాం సంవత్సరం పొడుగునా అనారోగ్యంతో మంచాన్ని వదలిరాదు.

సుబ్బారావు విసుక్కోడు. ఆ మనిషికి దిగులూ లేదు. విచారం అంతకన్నాలేదు. ఇంటికి రావడం ఆలస్యం పిల్లల్నెత్తుకుంటాడు. వంట చేస్తాడు. అర్థరాత్రి పన్నెండు గంటలకు పిల్లవాడు లేచి దొడ్డికెడతానంటే హుషారుగా లేచి వెడతాడు. తీరిక దొరుకుతే బీడీ కాలుస్తూ చాపమీద పడుకుని ఆనందం అనుభవిస్తాడు.

అతడెలా, ఇన్ని సమస్యలమధ్య ఆనందాన్ని పొందగలుగుతున్నాడు?

శ్రీహరిమూర్తికి అంతు చిక్కలా! సాయంత్రం పూట పేడమీద షికారు చేస్తూ వుంటాడు సంతోషంగా.

సుబ్బారావు సరిగా ఏ నెలా అద్దె ఇవ్వడు ఇవ్వలేడని తెలిసి, తను అడగలేడు. అది తన అసమర్థత. సుబ్బారావు దాన్ని మంచితనం అంటాడు.

అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది శ్రీహరిమూర్తికి—తన అసమర్థతను మంచితనంగా చెప్పటంలో, సుబ్బారావు కేదో స్వార్థముందనీ ఆస్వార్థంతోటే తనకి అద్దె సరిగ్గా ఇవ్వటం లేదేమోననీ.

ఏదైతేనేం తను అసమర్థుడు. ఏదీ సాధించలేడు. ఆ ప్రయత్నమూ చేయలేదు.

ఇలా ఎంతకాలం?

ఆనందభవన్‌లో భోజనం. సీతా సదన్‌లో పడక; కల్పనాలో ఇంగ్లీషు సినిమాలు చూడటం, ఇదేనా జీవితం? ఇంతకు మించి మరేమీ కాదా?

శ్రీహరిమూర్తికి ఆలోచన ముందుకు సాగలేదు.

చీకటిగదిలో శూన్యంలోకి చూస్తూ పడుకున్నాడు చాలాసేపు!

నిద్ర రాలేదు. వెధవ నిద్ర, రేపు పగలు పోవచ్చు.

ఎంతకాలమిలా రహదారి మీద మైలు రాయిలా వుండిపోవాలి!

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయి తల నొప్పి ప్రారంభమైంది.

క్రింద గ్యారేజికాపురస్తుడి, చిన్న కూతురు, అర్ధరాత్రి రాగాలాపన ఆరంభించింది. దాంతో చిర్రెత్తు కొచ్చింది.

నాలుగు రోజులు అక్కయ్యగారూరు వెడితే?

ఈ బాధలు మరచిపోవచ్చు. ఒంటరి తనాన్ని రాధ కబుర్లతో, అల్లుడి మాటల్తో పారద్రోలవచ్చు.

తెల్లారంగానే, అక్కయ్యగా రూరు వెళ్ళాలి. తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించాడు.

కాసేపన్నా నిద్రపోవాలి. లేకపోతే రేపు ప్రయాణంలో మరీ అలసి పోవాలి. కొంతదూరం నడవాలికూడా.

బలవంతాన కళ్ళు మూసుకున్నాడు.

సుబ్బారావుకి కోపంవచ్చి, కూతుర్ని నాలుగు ఉతికాడు ఎప్పుడూలేనిది.

ఆ పిల్ల పెద్ద బాకాలా ఆ నిశ్శబ్దంలోంచి కయ్యమని అరవసాగింది.

## 2

శ్రీహరిమూర్తికి మెలకువ వచ్చే సరికి పొద్దు పశ్చిమానికి జారింది.

వళ్ళంతా సమ్మెటతో కొట్టినట్లనిపించి ప్రక్కమీది నుంచి లేవాలనిపించ లేదు.

అలాగే పడుకుని మిద్దె పై భాగాన్ని చూస్తూ వుండిపోయాడు.

లోపల వంటింట్లోంచి, నూనె కాగుతున్న వాసన, ఉల్లిపాయల వాసన కలిసి, మత్తుగా ముక్కుపుటాలకు తగల సాగింది.

లేచి మొహం, కాళ్లూ, చేతులూ కడుక్కుందాం అనుకుంటుండగానే భారతి వచ్చేసింది నిండుకుండలా.

భారతి మొహం ఉబ్బి పాలిపోయివుంది. నీరసంగా, బడలికగా అడుగులు వేస్తూ వచ్చి ముక్కాలి పీట లాక్కుని కూర్చుని "ఎంత సేపైందిరా నిద్ర లేచి." అని అడిగింది.

"ఇప్పుడేనే" శ్రీహరిమూర్తి లేచి కూర్చున్నాడు.

"ముఖం కడుక్కుంటే, టిఫిన్ తెస్తాను. ప్రొద్దున కూడా సరిగ్గా తినలేదు భోజనం."

"తర్వాత కడుక్కుంటాలేవె...."

భారతి మెల్లగా లేచి వెళ్లిపోయింది వంటింట్లోకి.

అక్కయ్యను చూస్తే, శ్రీహరిమూర్తికి జాలివేసి కళ్ళు ఆర్ద్రమౌతాయి. కానీ అంతలోనే ఆనందమూ కలుగుతుంది.

భారతికి ఎస్.ఎస్.ఎల్.సి పాసవగానే పెళ్ళయింది. మరుసటి సంవత్సరం తల్లికూడా అయింది. సంసారంలో పడిపోయి, నవ్వుతూ, కబుర్లుచెబుతూ, స్నేహితురాళ్ళతో ఆడుతూ, తిరిగే భారతి పెళ్ళయిన తర్వాత స్తబ్ధుగా తయారైంది. యిల్లు పిల్లలు వంటింటికి అంకితమై, బాహ్య ప్రపంచాన్ని మర్చిపోయింది.

ఇదంతా తల్చుకుంటే శ్రీహరిమూర్తికి కడుపులో దేవినట్లవుతుంది. దీనికంతా చచ్చిస్వర్గాన విశ్రాంతి తీసుకుంటున్న తండ్రి మొండి పట్టుదల కారణం. ఆయన బ్రతికినన్నాళ్లూ తనమాట, చక్రవర్తి ఫర్మానాలా, రాణీ మార్కు రూపాయిలా, చెల్లించుకున్నాడు.

పిల్లాడికి చదువబ్బకపోయినా రెండు అరకల పొలముంది. పెద్దఇల్లుంది. వున్న వూళ్ళో తరగని పలుకుబడి, ప్రతిష్ఠ ఉన్నాయి। అనే ఆలోచించాడు.

కన్నకూతురు మనస్సు, వయస్సు వచ్చిన కొడుకు ఆలోచన గ్రహించ లేదు. ఏ ఉద్యోగస్థుడికో భార్య అయితే సుఖపడుతుందని ఆలోచించలేదు. ''అయ్యో కూతురు వయస్సులో చిన్నది, అనుభవం, ప్రపంచజ్ఞానం లేని పసిది'' అని తలంచలేదు.

దొడ్లో వున్న గేదెను అమ్మేసి, నిశ్చింతగా కూర్చున్న రైతులా, హాయిగా వుండిపోయాడు.

ఇదంతా.... తన అసమర్ధత అని శ్రీహరిమూర్తి నమ్మకం. తనే ఎదురు తిరిగివుంటే.... అవును, ఏమయ్యేది?....

'ఏమిట్రా అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావ్?

"నీ గురించేనే?"

"ఊ!" నవ్వింది భారతి. వాన కురిశాక ఎండ కాసినట్లు! ''ఏమని ఆలోచిస్తున్నా వేమిట్రా?''

''నాన్న నీ గొంతు కోశాడే, ఈ వూరి కోడలిని చేసి.... అవునా?''

నవ్వుతూనే, ''నువ్వు పూర్తిగా చెప్పరా?'' అంది భారతి, తమ్ముడి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"నిన్ను బాగా చదవించి డాక్టరుగా చేయాలనుకునే వాణ్ణి, మా అక్కయ్య ఈ జిల్లాకంతా పేరుమోసిన డాక్టరు అని చెప్పుకు తిరగాలనిపించేది చిన్నప్పుడు. లేదా ఏ జిల్లా ఆఫీసరు భార్యవో అయి, సంఘంలో ఓ గొప్పింటి యిల్లాలుగా తిరుగుతూ వుంటే చూద్దామని కలలు కన్నాను. లేదా! ఏ యూనివర్సిటీలోనో ప్రొఫెసరువై నాలాంటి వాళ్ళకు, విజ్ఞానం పంచి పెడుతుంటే బాగుండేదని ఆశించాను కాని,

"అగావేం చెప్పరా.... మీ బావ యిప్పుడే రార్లే."

"ఇలా వూరూ పేరు లేని కుగ్రామంలో ఓ రైతు భార్యవౌతావని ఊహించ లేదు! ఇక్కడేముంది చెప్పు, మట్టి మిద్దెలు వాన కురిస్తే చిత్తడి, గేదెల రొచ్చు దానికి తోడు గుడ్డిదీపాలు, రోగాలకూ నొప్పులకూ దైవాధీనం తప్ప మరో మార్గంలేని ఇది అడవి. ఆఫ్రికా లాంటి ఖండంలో అడవి మనుష్యుల నివాస స్థలం. ఈ వూళ్లో నీ జీవితాన్ని దానమిచ్చి, నాన్న నిన్ను అన్యాయం చేశాడు, అవును కదూ?"

క్షణం భారతి మాట్లాడలేదు. దీర్ఘంగా నిట్టూర్చింది.

"హరీ! నేను కష్టపడుతున్నానని నీ అభిప్రాయమా?"

"కాదా?" రెట్టించాడు శ్రీహరిమూర్తి,

"కాదనే నా అభిప్రాయం. ఊహ పూర్తిగా రాకముందే నాకు పెళ్ళి జరిగింది దానివల్ల నాకు జరిగిన అన్యాయమేం లేదు"

'అలా అని ఆత్మవంచన చేసుకోకు.''

"నన్ను పూర్తిగా చెప్పనివ్వరా!.... ఇప్పుడు నాకేం తక్కువ చెప్పు. చదువు రాకపోయినా, అభిమానించి, ప్రేమించగల భర్త, మొక్కజొన్న పొత్తిలా, పిల్లలూ, పాడీపంటా. ఇంతకన్న స్త్రీ కోరుకునేదేముంది? నువ్వన్నట్లు డాక్టరునైనా, ప్రొఫెసరునైనా, ఆఫీసరు భార్యనైనా నాకింతకన్నా సంతోషము కలుగదేమో? ఏదైనా మన మనస్సుబట్టి వుంటుంది! కాదంటావా?'

"నీవు చెప్పేదంతా పూర్తయ్యేదాకా మాట్లాడను''..శ్రీహరిమూర్తి బాసిపట్టు వేసుకుని మంచంమీద కూర్చున్నాడు.

భారతి చిన్నగా నవ్వి "హరీ, నేను సుఖపడాలంటే డాక్టరునే అవ్వక్కర లేదు. ఆఫీసరు భార్యలేం సుఖపడుతున్నారు? ఎప్పుడూ భర్త క్యాంపులకు,

క్లబ్బులకూ వెడితే. భార్య ముస్తాబై, నగలు ధరించి, కుక్కలతో ఆడుకో వలసిందేగా? ఐనా నేను ఇక్కడేదో బాధపడుతున్నానని నువ్వేలా అను కున్నావురా?''

శ్రీహరిమూర్తి, భారతిని పరీక్షగా చూశాడు పెదిమ విరిచి పైకి చూశాడు. ఆలోచనా పూర్వకంగా.

''నేనే పొరపడ్డానేమో?'' అన్నాడు.

భారతి చిన్నగా నవ్వి, మెల్లగా లేచి, తమ్ముడిని ఆప్యాయంగా స్పృ శించి, ''ఒరేయ్ చదువుకున్నావుగానీ, నీ బుద్ధింకా వయస్సుతోపాటు పెరగ లేదురా'' అని ''కాఫీ తెస్తానుండు'' అని వెళ్ళిపోయింది.

* * *

సాయంత్రం పొలాల వెంబడి తిరిగితే ఎంతో హాయనిపించింది శ్రీహరి మూర్తికి.

కనుచూపు మేరంతా, పచ్చగా, నవనవలాడుతూ కనుపించే పొలాలు గాలి వయ్యారంగా వచ్చి, పంట పొలాల మీద చీరెకొంగు వేసి బుగ్గలు పుణికి, అందకుండా పోతుంటే, తమాషాగావుంది శ్రీహరిమూర్తికి. కడిగిన ముత్యంలా వున్న ఆకాశంలో సూర్య భగవానుడు, ప్రొద్దస్తమానం ఆడుకుని ఎర్రటి దుమ్ముతో, గృహోన్ముఖుడవుతుంటె, మరీ మరీ ఆ పోకిరీ కుర్రాడిని చూడా లనిపించింది.

పచ్చటి గడ్డిమేసి, వాగులో నీళ్ళ త్రాగి నింపాదిగా నడిచే పశుగణాన్ని చూస్తే, కడుపు నిండినట్లునిపించింది. ఆకాశము, భూమి కౌగలించుకున్న చోట చూచి శ్రీహరిమూర్తి సిగ్గుపడ్డాడు. కనుచీకటి పడేవేళ, పూరి పాకల్లోంచి. గుమ్మడి తీగ ప్రక్కగా తెల్లగా, వయ్యారంగా, బద్ధకంగా పైకివచ్చే పొగ చూచి, ఎంత తమాషాగా వుంది। అనికూడ అనుకున్నాడు.

జామెంట్రీ బొమ్మల్లా వున్న ఇళ్ళు, ముక్కుకు సూటిగా వుండే రోడ్లు, సర్కసులో మనుషుల్లా, ఎవరి పనికోసం వాళ్ళు పరిగెత్తే జనం, వేళకు తప్ప రాని పంపు నీళ్ళు, ప్రతి వస్తువూ, ఆఖరికి మంచితనం కూడా వెలకె దొరికె పట్నాల్లో....సుఖం సంతోషం కోసం వెతకటం బుద్ధి తక్కువ అని తెలుసు కున్నాడు శ్రీహరిమూర్తి.

హరికేన్ లాంతరులోంచి కళ్లు పెద్దవిచేసుకు చూస్తున్న దీపపువెలుగుల్లో, బావగారి ప్రక్కన పెద్ద పీటమీద కూర్చుని, మధ్య మధ్యలో ఆ ప్రక్కగా వున్న, తెల్లటి చిన్న పిల్లి పిల్లల్ని పరీక్షగా చూస్తూ, చవులూరించే భోజనం చేస్తున్న శ్రీహరిమూర్తి, బావగారి ప్రశ్నకు టక్కున జవాబు చెప్పాడు.

"ఇప్పుడే పెళ్ళి చేసుకోడేమిటి మీవాడు."

భారతి జవాబు చెప్పేంతలో శ్రీహరే, "నువ్వు మాంచి కులంగల పిల్లని చూపిస్తే, ఎందుకు చేసుకోను?" అన్నాడు.

మోహనరావు క్షణం ఆశ్చర్యపడి మరుక్షణం భార్య కళ్ళలోకి చూసి, "నిజంగానా" అనడిగాడు సందేహం తీరక.

"అవును బావా!"

మోహనరావు మాట్లాడలేదు. శ్రీహరిమూర్తి తన అభిప్రాయం తెలియబరచి, మిగతా విషయాలు, అక్కా, బావ చూసుకుంటారని వూరుకున్నాడు.

భోజనాలలో చివర ప్రకరణానికివచ్చాక 'శంకరం మేష్టారమ్మాయి....' అని మోహనరావు అనేంతలో

"ఆ అమ్మాయిని చేసుకుంటాను బావా" అన్నాడు శ్రీహరిమూర్తి

భారతి ఆ మాటకు విభ్రాంతి చెందింది. మోహనరావు క్షణం నిరుత్తరుడై, ఆశ్చర్యంగా చూశాడు బావమరదిని.

"నిజం బావా! నా అభిప్రాయం మార్చుకున్నాను. ఆ అమ్మాయికి చదువు అంతగా రాకపోతేనేం, తెల్లగా బొండుమల్లె పువ్వులా బాగుంది. కట్నం వాళ్ళిచ్చినా నాకక్కరలేదు. గుణం, సంప్రదాయం మీకు తెలుసు. మీ యిష్టం. మాట్లాడండి నేను రెడీ"

క్షణం ఎవరూ మాట్లాడలేదు. శ్రీహరిమూర్తి తలెత్తి చూశాడు. భారతి తనవేపే దీక్షగా చూస్తూ వుండటం గమనించాడు శ్రీహరిమూర్తి.

''ఆ అమ్మాయికి పెళ్ళయిందిరా?''

"నిజం?" అనుమానం తీరక ప్రశ్నించాడు శ్రీహరిమూర్తి.

"ఎన్నాళ్ళకూ పెళ్ళి కాకపోతే ఏంచేస్తేరు. మొన్నీమధ్యనే రెండోపెళ్ళి వాడికిచ్చి చేశారు. పెళ్ళి కాగానే ఐదుగురు పిల్లలకు తల్లి కూడా అయింది పాపం!"

శ్రీహరిమూర్తికి అన్నం తినబుద్ధి కాలేదు. భోజనం అయిందనిపించి, వెళ్ళి ఆరుబయట, మంచంమీద పడుకున్నాడు. మజ్జిగలో వెన్నముద్దలాగా చందమామ ఆకాశంలో తేలియాడుతున్నాడు. దూరంగా వున్న కొండలమీద నుంచి వచ్చిన పిల్లతెమ్మెరలు, నిశ్శబ్దంగా ఆడుకోసాగాయి.

ఎంతకూ శ్రీహరిమూర్తికి నిద్రపట్ట లేదు. గొడ్ల సావిట్లోంచి, ఎద్దుల మెళ్ళల్లో కట్టిన గంటల చప్పుడు వినబడుతూనే వుంది! మాలపల్లెలోంచి. సన్నాయి మేళం గాలిలో కలిసి వినపడసాగింది.

ఆ అమ్మాయి .... ఐదుగురు పిల్లల తల్లిగా రెండో పెళ్ళివాడి భార్యగా వెళ్ళటానికి తను కారణమా?....ఆలోచిస్తూనే వున్నాడు శ్రీహరిమూర్తి.

తను ఆలోచించి ఓ నిర్ణయానికి ఏ విషయంలోనూ రాలేదు. తనను ఆజ్ఞాపించే వాళ్ళెవరూలేరు. అక్క సలహాయిస్తుంది. అంతే? యిలా అయితే తన జీవితం ఎలా తెల్లారుతుంది?

నిర్ణయించుకోలేక పోయాడు. తెల్లవారుతుండగా నిద్ర పట్టింది. అదీ మగత నిద్రే! మేరీ ఇగ్నాషియస్ కనబడింది నవ్వుతూ, శంకరం మేష్టార మ్మాయి కళ్ళతోనె శపిస్తూ దీనంగా చూస్తూ కనుపించింది.

అంతలోనే మెళకువ వచ్చింది. తూరుపున ఇళ్లు కాలుతున్నట్లు, ఆకాశం ఎరుపెక్కింది. ఊళ్ళో ఎక్కడో కోడికూసింది. శ్రీహరిమూర్తి లేచి సూట్ కేస్ సర్దుకున్నాడు. వంటింట్లో మజ్జిగ చిలుకుతున్న అక్కదగ్గరకు వెళ్లి, "నేను వెళ్లిపోతున్నానే" అని చెప్పాడు.

భారతి "ఏం అంత తొందర!? అన్నది. అయినా ఆమెకు తెలుసు, శ్రీహరిమూర్తి మన స్తత్వం!

"కాదులే వెళ్ళాలి!"

"తెల్లారనీ! మీ బావ పొలం వెళ్ళారు. వచ్చాక చెప్పి వెళుదువుగానీ!"

"లేదులే! బండికి వేళయింది. నువ్వు చెప్పు."

పాలేరు సూట్ కేసు తీసుకుని సిద్ధమయ్యాడు.

"మరి వెళ్తా?"

"ఊ"

భారతి వీధి వాకిట దాకా వచ్చి, "హరీ! ఇలా ఎంతకాలమని వుంటావు! త్వరగా పెళ్ళి చేసుకోరా!" అని చెప్పింది.

శ్రీహరిమూర్తి, ఆమె కళ్ళల్లోకి చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చి, "అలాగే" అని బయలుదేరాడు.

స్టేషను చేరేసరికి తూర్పున ఢిల్లున తెల్లారింది. అలవాటులేని నడకవల్ల, దేహమంతా చిరు చెమట పోసింది.

స్టేషనులో రాత్రి పడుకున్న జనం యింకా నిద్ర లేవలేదు. లేచిన ఒకరిద్దరు ముణగదీసుకు కూర్చున్నారు.

రైలు రాక ఒక గంట లేటు!

శ్రీహరిమూర్తి ప్లాట్‌ఫారం చివరనవున్న ఓ బెంచీ అంచున కూర్చున్నాడు, పాలేరును పంపేసి. బెంచీమీద ఓ ఆసామికాళ్ళు నిగడదన్ని నిద్రపోతున్నాడు. ప్రక్కనేవున్న గంగరావి చెట్టుమీద పిచ్చుకలు, పంతులులేని క్లాసులో పిల్లల్లాగ గోల చేయసాగాయి. స్టేషను కెదురుగావున్న తుమ్మబీడులోని ఓ తుమ్మచెట్టుపై కొన్ని కొంగలు సభ చేశాయి. మంచుకు నానిన రైలు పట్టాలు, సూర్యరశ్మికి కిసుక్కున నవ్వుతున్నాయి.

తెల్లవార్లూ నిద్ర లేకపోవటంవల్ల కళ్ళు మండసాగాయి. సిగరెట్ కాల్చుకున్నాడు.

"వధువు కావలెను!" అని పేపర్లోవేస్తే! అనుకున్నాడు శ్రీహరిమూర్తి. దానివల్ల యోగ్యులు, అందము. వినయ విధేయతలు గల కులమింటి పిల్లలు రాకపోవచ్చు. అయితే మాత్రం ఏం? ఏ మేరీలాంటి వాళ్ళో తప్పక వస్తారుగా।

ఆ ప్రకటన ఊళ్ళోవాళ్లూ చూస్తారు. తను పెళ్ళి చూపులకు సిద్ధమైనట్లు తెలిస్తే, కోటప్పకొండ తిరునాళ్ళలా జనం వచ్చి పడతారు. కూర్చోనివ్వరు, నుంచో నివ్వరు ఆలోచించ నివ్వరు?........?? లాభం లేదు అని నిర్ణయించుకున్నాడు.

పోనీ ఏదన్నా ఉద్యోగం చేస్తే?....మనస్సు కోతిపిల్లలా స్థిరం లేకుండా తిరగదు. నిత్యకృత్యమంటూ ఏర్పడి, జీవితంలో కొంత వెసులుబాటు దొరుకుతుంది. క్రొత్త పరిచయాలు, క్రొత్త జీవితం!

కానీ, తన్ను తెలిసిన వాళ్ళెవరు ఉద్యోగం ఇవ్వరు!

"ఏమిటీ! ఉద్యోగం చేస్తావా?...."

అని ఆశ్చర్యపోతారు. అంతకన్నా మరో పెద్ద వింత లేదన్నట్లు!

''చూస్తున్నావుగా ఈ ఉద్యోగం చేసి మేం ఏం బావుకుంటున్నామో స్థిరాస్తి, అరడజను మంది పిల్లలు, చరాస్తి, ఉద్యోగమూను, పోయి ఉన్న ఆస్తిని పాడుకాకుండా చూసుకో! చాలు. నువ్వుకూడా సంపాయించి ఎవరికి పెడతావ్!'' అని సలహాకూడా ఇస్తారు.

ఒక్కసారి శ్రీహరిమూర్తికి తల్లిదండ్రులమీద కోపం వచ్చింది. యింత ఆస్తి యిచ్చి తనను అసమర్థుడిగా పుట్టించినందుకు

రాబోయే రైలుకి మంగళవాక్యం పలికారు శ్రీహరిమూర్తి వెళ్ళి టిక్కెట్టు తెచ్చుకున్నాడు. యింతవరకు ముణగదీసుకు నిద్రపోతున్న స్టేషను, క్షణంలో పెళ్ళివారి ఇల్లయింది. చీమల్లాగ జనం ప్లాట్ ఫారం నిండా చేరారు పెట్టెలతోటి, గోనె సంచుల తోటీని.

ఎండ బాగా వచ్చేసింది. రైల్వేస్టేషను, సిగ్నల్ స్తంభాలు, చుట్టు ప్రక్కల పంట పొలాలు, చెట్టు, చేమ స్పష్టంగా కనబడసాగాయి. రైల్వే పోర్టర్లు, సిరా రంగు చొక్కాలతో, తెల్లవాళ్ళ మధ్య ఆఫ్రికనుల్లా, బియ్యం లోని రాళ్ళలా కనుపించసాగారు.

రైలు, సామాన్యుడు సంసారాన్ని భారంగా మోస్తున్నట్లు, పొగలు సెగలు కక్కుకుంటూ, ఉసూరుమని నిట్టూరుస్తూ వచ్చి ఆగింది. హోలోమని జనం కేకలతో అరుపులతో ఒక్కో పెట్టెదగ్గరకూ పరిగెత్తి లోపలకుపోయ్యే సందులేక మరోదానివైపు పరిగెట్టుతూ తొక్కుకుంటూ తోసుకుంటూ నెట్టుకుంటున్నారు.

శ్రీహరిమూర్తికూడా సూట్ కేసు పట్టుకు ముందుకూ వెనక్కూ ఆసులో గొట్టంలా తిరిగాడు. ఏ మూడవ తరగతి పెట్టిలోకి ప్రవేశించలేకపోయాడు.

'సెకండ్ క్లాస్ టిక్కెట్ కొనాల్సింది!' అని నిటూర్చాడు. పోనీ టిక్కెట్ మార్చుకుందామంటే, రైలు ఆగినట్లు ఆగి, మళ్ళ బయలుదేరుతుంటే శ్రీహరి మూర్తికేం చెయ్యాలో తోచలేదు.

ఇంతలో ఎవరో పిలుస్తున్నట్లు తోచి, ఆ పిలుపు వచ్చినవేపు చూశాడు.

మేరీ ఇగ్నాషియస్ అలెగ్జాండర్!

ఆశ్చర్యపోయాడు.

"కమ్ హియర్ ఇడియట్" మేరి కసిగా పిల్చింది. స్థాణువులా వున్న శ్రీహరిమూర్తిని!

దగ్గరగా వెళ్ళాడు.

"రావటంలేదా!"

"నువ్వొక్కణ్ణుంచి!"

"ఫూల్! ముందు గెటిన్, బండి బయలుదేరుతున్నది!"

గార్డ్ విజిల్ వేశాడు. అప్పటిదాకా, ప్లాట్ ఫారం మీద దమ్ము లాగుతున్న డ్రైవర్ అనాసక్తంగానే ఇంజన్ లో కెళ్ళాడు. జనమంతా, కోతి పిల్లల్లా రైలుని కరుచుకున్నారు.

శ్రీహరిమూర్తి, ఇంకేం ఆలోచించకుండా, పెట్టిలో కెళ్ళాడు,

మేరీ ఎదురొచ్చి, మీదబడి వాటేసుకున్నంత పనిచేసి, ప్రక్కన కూర్చొబెట్టుకుంది.

ప్రకృతి వెనకడుగు, రైలు ముందడుగు వేసినాయి.

"ఎక్కణ్ణుంచి ఈ రావటం?"

"మీ బెంగుళూర్"

"మీ ఆయనేడీ?"

"మిష్టర్ హారీ! యు హావ్ నాట్ చేంజ్డ్! ఓల్డ్ బగ్గర్! ఎదురుగా నేనుండగా ఆయనెందుకు!"

"తెలుసుకుందామని...." నసిగాడు శ్రీహరిమూర్తి మేరీ కళ్ళల్లోని చిమ్మలే చూసి జంకి!"

'డైవోర్స్‌డ్!....ఇట్ ఈజ్ ఎ పాస్ట్!....అది సరే నీ సంగతులు చెప్పు! హావ్‌యు మారీడ్"

"లేదు!"

''ఈజ్ ఇట్?....వై!''

''నీ కోసమే!''

''రియల్లీ.... డోంట్ స్పీక్‌లై.''

ఆమె కళ్ళల్లోని మెరుపు, సిగ్గుచూసి సమ్మోహితుడైనాడు శ్రీహరిమూర్తి! రైలు కుదుపుకు ఊగుతున్న ఆమె వక్షద్వయం చూసి, పెదాలు చప్పరించాడు. స్వెట్టర్ క్రిందుగా కనబడుతున్న ఆమె ఉబికిన పొట్టచూసి మనసుబడ్డాడు. ఫ్రాక్ క్రిందుగా అరటి బోదెల్లావున్న కాళ్ళను చూసి ముద్దెట్టుకోవాలని ఆశ పడ్డాడు.

"వై ఆర్ యు మమ్!"

"నీ కోసమే!"

చిన్నగా నవ్వింది మేరీ!" పైబెర్త్ మీద నిద్రబోతున్న మీసాల ఆసామిని, వోరగంట చూసి, తన్నే చూస్తున్న మేకపిల్లపై, ఆకలిగొన్న సింహంలా దూకి, గట్టిగా కౌగిలించుకుని, చురుక్కుమనేలా, శ్రీహరిమూర్తిని ముద్దెట్టుకుని,

సిగ్గుతో తల వొంచుకుని, జారగిలబడి కూర్చుంది.

మెరుపులాంటి ఆమె చర్యకు, తొలి స్త్రీ స్పర్శకు, శ్రీహరిమూర్తి క్షణం విభ్రాంతుడై, తేరుకుని, జరిగినదేమిటో నెమరువేసుకుని ఆమె స్పర్శతగిలిన చోట నిమురుకుని చేత్తో. "మేరీ! నన్ను పెళ్ళి చేసుకుంటావా" అనడిగాడు.

'వాట్....' గదిమింది మేరీ! తలొంచుకున్నాడు శ్రీహరిమూర్తి బెరుగ్గా!

"యూ సిల్లీ ఫెలో!" అని బుజ్జగించింది, మళ్ళీ మేరీ, శ్రీహరి తలను గుండెల మీదకు ప్రేమగా, అద్దుకుని.

పసివాడే అయినాడు శ్రీహరిమూర్తి, ఆ లాలనకు!

రైలు కుదుపుతు ఆలోచనలు, కందిరీగల్లా ముసురుకున్నాయి.

మేరీతో చేయి కలిపి, క్రొత్త లోకాల్లోకి వెళ్ళిపోయి, ఆనందాన్ని, అనుభూతినీ పంచుకుంటూ అలాగే వుండిపోతే—

మేరీ తనతో యిలాగే వుండిపోతుందా? ప్రశ్న?

ఉండకపోతే? .... ఆలోచన .... ఏం చెయ్యాలి?

దారి తప్పిన ప్రయాణికుడిలా సముద్రాన్ని తొలిసారిచూసే కుర్రాడిలా, జీవితం అర్ధకాని పదార్థం, అని తీర్మానించుకొని వుండిపోవల్సిందేనా?

రైలు ఆగింది ఏదో స్టేషనులో!

"ఏ వూరు?" తన ముఖంమీద పరచుకున్న మేరీ జుత్తులోంచి ప్రశ్నించాడు శ్రీహరి.

చెప్పింది మేరీ!

వెన్నెముకలోంచి భయం కేక వేసింది.

ఆఘాటున లేచి, సూట్ కేస్ పట్టుకున్న శ్రీహరిని అడిగింది, మేరీ

"ఎక్కడకూ!'' అని?

"ఎక్కడకూ రాను.... సీతో స్వర్గానికైనా సరే?" చకచకా దిగి వెళ్ళి పోయాడు శ్రీహరిమూర్తి.

పోతున్న రైల్లోంచి విచిత్రంగా చూస్తున్నది మేరీ, శ్రీహరిమూర్తిని.

మేరీ ఎంగిలి విస్తరాకు!

తను యింకా మైలపడలేదు!

అందుకు శ్రీహరిమూర్తి సంతోషించాడు.

అతడు లోలకం! జడ పదార్థం! ఎవరో అతన్ని కదపాలి! ఆ కాసేపు స్పందిస్తాడు! అంతే—

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 27—4—73)